ఈనాడు
నిర్మల్
గురువారం అక్టోబరు 24, 2024

డొక్కు బస్సులే దిక్కు!

● ఆర్టీసీలో సగం అద్దె వాహనాలే
● నిర్వహణ లేక తరచూ మొరాయింపు

ఈటీవీ – ఆదిలాబాద్

ఆదిలాబాద్ రీజియన్ ఆరు డిపోల పరిధిలో 620 బస్సులుంటే 311 అద్దెవి ఉన్నాయి. 309 సంస్థ బస్సులున్నాయి. ఆర్టీఏ నియమావళి ప్రకారం 15 ఏళ్లు దాటినా.. 13 లక్షల కిలోమీటర్ల వరకు తిరిగిన బస్సులను వినియోగించరాదనే నిబంధనలు ఆర్టీసీలో అమలు కావటం లేదు. రీజియన్ పరిధిలో 16 లక్షల కిలోమీటర్ల దాటిన 70 బస్సులను ఇంకా తిప్పుతూనే ఉన్నారంటే జిల్లాకు ఆ సంస్థ ఇస్తున్న ప్రాధాన్యం వెల్లడవుతోంది. ఇందులో నిర్ణీత గడువు ముగిసిన 30 నుంచి 40 బస్సులను స్క్రాప్‌కు పంపించాల్సి ఉన్నా సరిపడా కొత్త బస్సుల్లేక పాత వాటినే ఏదో రకంగా వినియోగించుకోవాల్సి వస్తోంది. అద్దె బస్సుల పరిస్థితిని చూసేవారేలేరు.

భైంసా డిపోలో 32 బస్సుల్లో 30 పాతవే

భైంసా: భైంసా డిపో పరిధిలోని బస్సులన్నీ పాతవే కావడంతో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చడంలో మొరాయిస్తున్నాయి. దీంతో ప్రయాణికులు, డ్రైవర్లు, కండక్టర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డిపోలో సంస్థకు చెందిన బస్సులు 32 ఉండగా, వాటిలో 30 పాతవే. నిత్యం ఆయా మార్గాల్లో ఎక్కడో ఒక బస్సు మధ్యలోనే ఆగిపోతోంది. 47 అద్దె బస్సుల్లో కొన్నింటి పరిస్థితి అలాగే ఉంది. వాటి నిర్వహణ బాధ్యత సంబంధిత యాజమాన్యాలదే అయినా, వాటిని ప్రతి రోజు పరిశీలించి బస్టాండుకు పంపాల్సిన బాధ్యత డిపో అధికారులదే. తాజాగా ఎడ్‌బిడ్ సర్వీసు అద్దె బస్సు మంగళవారం మూడు సార్లు మొరాయించింది. రాత్రి సైతం భైంసా బస్టాండు దాటకుండానే సాంకేతిక కారణాలతో నిలిచి పోయింది. వెంటనే మెకానిక్‌లు వచ్చి మరమ్మతులు చేయడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా సాయంత్రం 6 గంటల వరకే విధులు నిర్వహించాల్సిన మహిళా కండక్టరు రాత్రి 9:30 గంటలకు ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చి ఇంటికి వెళ్లాల్సి వచ్చింది. దీనిపై డీఎం హరిప్రసాద్‌ను వివరణ కోరగా.. అన్ని పాత బస్సులే ఉన్నాయి. గుంతల రహదారుల కారణంగా సమస్య వస్తోంది. కొత్త బస్సులు ఇప్పించాలని ఉన్నతాధికారులను కోరాం. 5 ఎలక్ట్రికల్ బస్సులకు ప్రతిపాదనలు పంపించామని పేర్కొన్నారు.


భైంసాలో మంగళవారం రాత్రి మహిళా కండక్టరు సెల్‌ఫోన్ వెలుతురులో మరమ్మతు చేస్తున్న డ్రైవర్, మెకానిక్



ఎక్కడపడితే అక్కడే ఆగిపోతూ..

ఆదిలాబాద్ బస్టాండు నుంచి బయలుదేరిన అయిదు నిమిషాలకే కొద్ది దూరంలోనే ఆర్టీసీ బస్సు ఆగిపోయింది. బస్సు నిండా ప్రయాణికులు ఉన్నారు. వారంతా తిరిగి కాలినడకన అవస్థలు పడుతూ బస్టాండ్‌కు మరో బస్సు కోసం వెళ్లారు. నిజామాబాద్‌కు వెళ్లాల్సిన ఆదిలాబాద్ డిపోకు చెందిన బస్సు మంగళవారం మరమ్మతులతో ఒక్కసారిగా ఆగిపోయింది. నిత్యం ఇలాగే జరుగుతున్నా పట్టింపు కరవైంది.

కొత్తవి రావడం లేదు



ఇది మంచిర్యాల డిపో పరిధిలోని ఓ డొక్కు బస్సు. ఇలాంటివి చాలానే ఉన్నాయి. ప్రయాణానికి అసలు పనికి రాని మూడు బస్సులను గుర్తించిన అధికారులు కరీంనగర్‌లోని సంస్థ స్క్రాప్ షెడ్డుకు పంపించాలని పక్కనపెట్టారు. వాటిస్థానంలో ఒకటే కొత్త బస్సును కేటాయించారు. ఈ దుస్థితి కేవలం మంచిర్యాల డిపోకే పరిమితం కాలేదు. మహాలక్ష్మి పథకం ద్వారా సంస్థకు ఆదాయం సమకూరుతున్నా బస్సులు సంఖ్య పెరగడం లేదు.

ఉమ్మడి జిల్లాలోని బస్సుల వివరాలు..
■ ఆర్టీసీ ■ అద్దె

	ఆర్టీసీ	అద్దె
రాజధాని	08	--
లహరి(ఏసీ)	12	--
లహరి (నాన్ ఏసీ)	14	--
సూపర్ లగ్జరీ	88	--
డీలక్స్	03	--
సెమీ డీలక్స్	04	--
ఎక్స్‌ప్రెస్	33	75
పల్లె వెలుగు	149	234

అన్నింటిని పరిష్కరిస్తాం

– ప్రణీత్, డిప్యూటీ ఆర్‌ఎం



ఒక్కో సమస్యను పరిష్కరించే ప్రయత్నం జరుగుతోంది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా కొత్త బస్సుల కోసం ఉన్నతాధికారులకు లేఖ రాశాం. రీజియన్ పరిధిలోని పుణ్యక్షేత్రాలు, పర్యాటక కేంద్రాలకు సర్వీసులు తిప్పేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తాం.

శతశాతం పన్నుల వసూలు చేయాలి

లక్ష్మణచాంద: గ్రామాల్లో ఇంటి పన్నులను పంచాయతీ కార్యదర్శులు వందశాతం వసూలు చేయాలని ఎంపీడీవో రాధ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో బుధవారం సమావేశం నిర్వహించారు. పారిశుద్ధ్యం పనులను నిరంతరాయంగా కొనసాగించాలని సూచించారు. పొట్టపెల్లి(కె) గ్రామ పంచాయతీని పరిశీలించారు. కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసి అన్ని రకాల ఆకు కూరల పండించి విద్యార్థుల మధ్యాహ్న భోజనానికి ఉపయోగించాలన్నారు.


కొబ్బరి తోట.. ఆదాయం బాట!

కొబ్బరితోటలు అంటే ఏపీలోని కోస్తా జిల్లాలు గుర్తుకొస్తాయి. ఒక్కసారి కొబ్బరి చెట్లను పెంచితే దీర్ఘకాలం ఆదాయమిస్తాయి. అందుకే వీటిని పెద్దకొడుకుగా అభివర్ణిస్తుంటారు. ఇటీవల తెలంగాణలో సైతం పొలం గట్ల వెంబడి కొందరు రైతులు కొబ్బరి చెట్ల పెంపకం చేపట్టారు. లక్ష్మణచాంద మండల కేంద్రానికి చెందిన పెర్క భూమేష్, పెర్క మహేష్ అనే రైతులు ప్రయోగాత్మకంగా రెండెకరాల్లో మూడేళ్ల క్రితం నాటిన కొబ్బరి మొక్కలు ఏపుగా ఎదిగాయి. నాలుగో సంవత్సరం కాయలు కాస్తాయని, ఆదాయం కోసం ఎదురు చూస్తున్నామని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతానికి అంతర పంటగా పసుపు పండిస్తున్నామని తెలిపారు. చిత్రం: న్యూస్‌టుడే, నిర్మల్



పాడి ఘనం.. పశువైద్యం దైన్యం

● సరిపడా వైద్యశాలలున్నా వెక్కిరిస్తున్న ఖాళీలు



లోకేశ్వరం, న్యూస్‌టుడే:

నిర్మల్ జిల్లాలోని పలు గ్రామాలు గోదావరి పరీవాహక ప్రాంతాలుగా ఉండటంతో ఇక్కడ పశువుల సంఖ్య అధికంగా ఉంటుంది. పశువుల సంఖ్యకు సరిపడా వైద్య కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నా వాటిలో అవసరమైన పోస్టులను భర్తీ చేయకపోవడంతో సేవలు అంతంతమాత్రంగా అందుతున్నాయి. జిల్లా మొత్తంగా 47 వైద్యశాలలుండగా అందులో 29 డాక్టరు పోస్టులుంటే అందులోనూ ఆరు ఖాళీలున్నాయి. 15 ఉప కేంద్రాలుండగా వాటన్నింటినీ సహాయకులతో కొనసాగిస్తున్నారు.




వైద్యులు లేక బోసిపోయిన లోకేశ్వరం పశు వైద్యశాల

కొత్తగా వైద్యులొచ్చినా.. సుముఖత శూన్యం

ఇటీవల ప్రభుత్వం పశువైద్యుల పోస్టులను భర్తీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఈ భర్తీలో నిర్మల్ జిల్లాను ఎంపిక చేసుకునే వారే కరవయ్యారు. ఇక్కడ కనీసం 9 మంది వైద్యులు అవసరమని జిల్లా పశువైద్య శాఖాధికారులు ప్రతిపాదనలు పంపగా కేవలం నలుగురు మాత్రమే నిర్మల్ జిల్లాను ఎంచుకున్నారు. వారిని కడెం, రేవోజీపేట, కుంటాల, పొన్కల్ వైద్యశాలలకు పంపించారు. ఇక ముథోల్ నియోజకవర్గానికి వస్తే తానూరు, భైంసా, లోకేశ్వరం, కన్నాపూర్, బోసి అయిదు కేంద్రాల్లో పశువైద్యం అందని ద్రాక్షలా మిగిలింది.

ప్రయత్నం చేస్తూనే ఉన్నాం

– బాలిక్ అహ్మద్, జిల్లా పశువైద్యాధికారి

జిల్లాలో వైద్యుల కొరతపై ఇది వరకే శాఖ తరపున ఉన్నతాధికారుకు నివేదించాం. నాతోపాటు ఎమ్మెల్యేలు తమవంతు ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. కొత్తగా ఎంపికైన వారు స్థానికంగా ఉండేందుకు ఆసక్తి చూపడంతో ఇక్కడికి వచ్చే వారు తగ్గిపోయారు. ఇటీవల నలుగురు రాగా వారికి పోస్టింగులు ఇచ్చాం. మరో ఆరుగురు వైద్యులు వస్తే సర్దుబాటు అవుతుంది. సహాయకుల పోస్టులు కూడా ఖాళీగా ఉన్నాయి.

లోకేశ్వరంలో మరీ దారుణం

లోకేశ్వరం మండలంలోని గడ్‌చంద, పిప్రి, భామ్ని(కే), రాజురా వట్టోలి, పంచగుడి, ధర్మోర, వాస్తాపూర్, అబ్దుల్లాపూర్, కన్నాపూర్ గ్రామాలు గోదావరి పరీవాహక ప్రాంతంగా ఉంటాయి. దీంతో ఇక్కడి రైతులు ఎక్కువగా పశువులు, మూగజీవాల పెంపకంపై ఆధారపడి ఉంటారు. మండలంలో లోకేశ్వరం, కన్నాపూర్ గ్రామాల్లో రెండు పశువైద్యశాలలు ఉన్నాయి. రెండు కేంద్రాల్లో ఇద్దరు వైద్యులు, ఇద్దరు సహాయకులు, ఇద్దరు అటెండర్లు ఉండాలి. కానీ ప్రస్తుతం ఒక వెటర్నరీ అసిస్టెంటు(అది కూడా ఇన్‌ఛార్జి) మాత్రమే ఉండటంతో ఇక్కడి పశుపోషకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలో అధికారుల లెక్క ప్రకారం పశువులు 21 వేల వరకు, గొర్రెలు, మేకలు 80 వేల వరకు ఉంటాయి. మండలంలోని పశుపోషకులంతా ప్రస్తుతం ప్రైవేటు వైద్యులపై ఆధారపడాల్సి వస్తుంది.


నాలుగేళ్లుగా మూతపడిన కన్నాపూర్ పశు వైద్యశాల


కడ్తాల్‌లో రహదారిని ఆవరించిన పొగ

పంట వ్యర్థాలకు నిప్పు.. వాహన చోదకులకు ముప్పు

సోన్ మండలంలోని పలు గ్రామాల్లో రహదారులపై రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకొని, వ్యర్థాలను అక్కడే వదిలివేస్తున్నారు. బుధవారం కడ్తాల్ గ్రామంలో ఇలా రహదారి పక్కన వదిలేసిన వ్యర్థాలకు నిప్పుపెట్టారు. రహదారిపై పొగ కమ్ముకొని ఏమీ కనిపించటంలేదు. వాహన చోదకులు ఆ మార్గంలో నానా తిప్పలు పడ్డారు. పంటకుప్పల పక్కనే రక్షణకు ఏర్పాటుచేసుకున్న బండరాళ్లను కొందరు నిర్లక్ష్యంగా అక్కడే వదిలేస్తున్నారు. పొగ, చీకటిపూట వాటితో ప్రమాదాలు పొంచి ఉన్నాయి.

-న్యూస్‌టుడే, సోన్

తరలింపుతో గతి తప్పిన ప్రగతి..

● ఉట్నూరు వీడుతున్న ముఖ్యశాఖలు
● అవస్థల్లో గిరిజనులు

ఏజెన్సీ ప్రాంతాలలో ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం దశాబ్దాల కిందట ఏర్పాటు చేసిన ముఖ్యమైన ప్రభుత్వ శాఖలను క్రమంగా మైదాన ప్రాంతాలకు తరలించేశారు. ఇది ఏజెన్సీ గ్రామాల అభివృద్ధిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. అభివృద్ధి కోసం మరిన్ని శాఖలను తీసుకురావాల్సిన పాలకులు ఉన్న వాటిని తొలగించడంతో ప్రగతి కుంటుపడుతోందని గిరిజనులు వాపోతున్నారు.

న్యూస్‌టుడే, ఉట్నూరు

ఉమ్మడి జిల్లాలోని ఆదివాసీ గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంతో ఉట్నూరులో సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ) కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఆ తరువాత ఐటీడీఏ ఆధీనంలోని ఏజెన్సీ డివిజన్ పరిధిలోని ఉట్నూరు, ఇంద్రవెల్లి, నార్నూర్, గాదిగూడ, సిరికొండ, జైనూర్, సిర్పూరు(యు), లింగాపూర్ మండలాల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఇక్కడి చిన్న నీటి పారుదలశాఖ, సహాయ వ్యవసాయ సంచాలకులు(ఏడీఏ), జిల్లా మలేరియా అధికారి(డీఎంవో), పట్టు పరిశ్రమ శాఖ సంచాలకులు(ఏడీ), రోడ్లు, భవనాల డివిజన్ కార్యాలయాలను ఏర్పాటు చేసింది. వీటి ద్వారా ఏజెన్సీ మండలాలలో అభివృద్ధి పనులు చేపట్టేవారు. సంక్షేమ పథకాలు అమలు చేసేవారు. ప్రస్తుతం ముఖ్యమైన ఆ శాఖలను ప్రభుత్వం మైదాన ప్రాంతాలకు తరలించింది.

చిన్ననీటి పారుదల శాఖ ఆదిలాబాద్‌కు

ఏజెన్సీ ప్రాంతంలో సాగునీటి పథకాలను వినియోగంలోకి తేవాలనే లక్ష్యంతో 1980లో ఐటీడీఏ కార్యాలయం ఉట్నూరులో చిన్ననీటి పారుదలశాఖ డివిజన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది. ఈ శాఖ ఆధ్వర్యంలో ఏజెన్సీ మండలాలలోని చెరువులకు మరమ్మతులు, కొత్త చెరువుల నిర్మాణం, కుంటల తవ్వకాలు చేపట్టి రైతులకు సాగునీటి సమస్యను తీర్చేవారు. 2016లో ప్రభుత్వం నీటి పారుదల శాఖలో చేపట్టిన మార్పులతో ఉట్నూరులోని చిన్న నీటి పారుదల శాఖను మైదాన ప్రాంతమైన ఆదిలాబాద్‌కు తరలించి, నీటి పారుదల శాఖలో కలిపేసింది.

అందని వ్యవ'సాయం'

ఏజెన్సీ ప్రాంతంలోని సుమారు 50 వేలకు పైచిలుకు రైతులకు సంబంధించి 1.50 లక్షల ఎకరాలలో పండించే పంటలు, వ్యవసాయ సాగులో వచ్చే సమస్యలను పరిష్కరించే లక్ష్యంతో ఉట్నూరులో ఏర్పాటు చేసిన సహాయ వ్యవసాయ సంచాలకుడి(ఏడీఏ) కార్యాలయాన్ని ప్రభుత్వం ఇచ్చోడకు తరలించింది. సహాయ వ్యవసాయ సంచాలకులు లేక రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు.

మలేరియా తగ్గేదెలా?

ఏజెన్సీ ప్రాంతంలో కాలంతోపాటు కీటక జనిత వ్యాధులు విజృంభిస్తుంటాయని గుర్తించిన ప్రభుత్వం 1980లో ఇక్కడ జిల్లా మలేరియాధికారి కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది. మూడు దశాబ్దాల పాటు ఇక్కడ సేవలందించిన కార్యాలయాన్ని ప్రభుత్వం ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి తరలించింది. ఏజెన్సీలో మలేరియాధికారి లేక పర్యవేక్షణ కరవై మారుమూల గ్రామీణ ప్రాంతాలలో దోమలకాటుతో వచ్చే మలేరియా ఇతర వ్యాధులు పెరిగిపోయి ప్రజారోగ్యంపై ప్రభావం పడుతోంది.

మరిన్ని శాఖలు..

రహదారుల నిర్మాణం కోసం ఉట్నూరులో ఏర్పాటు చేసిన రోడ్లు, భవనాల శాఖ డివిజన్ కార్యాలయాన్ని చెన్నూరుకు తరలించారు. ఆదివాసీ గిరిజనులకు సత్వర న్యాయం కోసం గతంలో ఇక్కడ ఏర్పాటు చేసిన సంచార న్యాయస్థాన వ్యవస్థను మూసేశారు. ఐటీడీఏ ఉట్నూరులో మంజూరుచేసిన ప్రత్యేక ఏజెన్సీ విద్యాధికారి పోస్టు, పట్టు పరిశ్రమల శాఖ సంచాలకుడి(ఏడీ) పోస్టును రద్దు చేశారు.



మాటేగాం కొనుగోలు కేంద్రంలో గోదాము నీడలో, వాహనంలో ఉంచిన సోయా నిల్వలు

తూకాలకు కర్షకుల నిరీక్షణ

భైంసా గ్రామీణం, న్యూస్‌టుడే: మాటేగాంలో పది రోజుల క్రితం మిర్జాపూర్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో సోయా కొనుగోలు కేంద్రం ఏర్పాటుచేశారు. మార్కెట్ ధరతో పోల్చుకుంటే క్వింటాలు సోయాకు ఇక్కడ రూ. 600-800 తేడా ఉంది. దీంతో రైతులు కేంద్రంలో విక్రయించేందుకు మొగ్గుచూపుతున్నారు. రెండు మండలాలకు ఒకే కేంద్రం కావడంతో రద్దీ అధికంగా ఉంది. వాతావరణంలో మార్పుల కారణంగా తూకం పనులు అంతంత మాత్రంగానే సాగుతున్నాయి. తేమ నిబంధనలు రైతులకు కష్టాలను తెచ్చిపెడుతున్నాయి. పలువురు రైతులు వాహనాల్లోనే ఉంచి తమవంతు వచ్చే వరకు అలాగే ఉంచేస్తున్నారు. దీంతో వాహన అద్దె భారమవుతోంది. ప్రతి రోజు తమవంతు రాక కోసం ఆరా తీయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. మద్దతు ధర కోసం కర్షకులకు నిరీక్షణ తప్పడం లేదు. ప్రభుత్వం తూకం వేగవంతం అయ్యేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు

రసీదులు ఇచ్చారు... ఆన్‌లైన్‌లో మరిచారు

● అర్హులకు అందని ప్రభుత్వ పథకాలు



అధికారులు ఇచ్చిన ప్రజాపాలన రసీదు

ముథోల్, భైంసా గ్రామీణం, న్యూస్‌టుడే: అర్హులకు సంక్షేమ పథకాలను వర్తింపజేయడానికి ప్రభుత్వం గ్రామాల్లో ప్రజాపాలన పేరిట దరఖాస్తులు స్వీకరించింది. అన్ని గ్రామాల్లో దరఖాస్తులు స్వీకరించి రసీదులు కూడా అందించారు. దరఖాస్తులను మండల పరిషత్తు కార్యాలయాల్లో ఎంపీడీఓలకు అప్పగించారు. వారు కంప్యూటర్ల ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేయించారు. దరఖాస్తులు అధికంగా ఉండటం, సరిపడా ఆపరేటర్లు, కంప్యూటర్లు అందుబాటులో లేకపోవడం, గడువు సమీపించడంతో అప్పటి ఎంపీడీఓలు తమకు తెలిసిన వారితో.. ముథోల్, బాసర ఎంపీడీఓలు ఆర్జీయూకేటీ విద్యార్థులతో ఆన్‌లైన్ చేయించారు. కానీ పర్యవేక్షణ లేకపోవడంతో వారికి తెలిసింది ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. పనిభారంతో అధికారులు కూడా వారు నిక్షిప్తం చేసిందే వాస్తవమని నమ్మారు. ప్రస్తుతం అర్హులకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోంది. అయితే దీనికి ప్రజాపాలనలో దరఖాస్తునే ప్రాతిపాదికగా తీసుకుంటోంది. దరఖాస్తు చేసుకుని, ఆన్‌లైన్‌లో నమోదై ఉంటేనే లబ్ధికి పరిశీలిస్తున్నారు. అయితే చాలా మంది అర్హులైనా సంక్షేమ పథకాలు అందడం లేదు. ఇదేమని ఆరా తీస్తే దరఖాస్తు రసీదులో లబ్ధికోసం పేర్కొన్న అంశాలు ఆన్‌లైన్‌లో కనిపించడం లేదు. దీంతో దరఖాస్తుదారులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ సమస్య జిల్లా వ్యాప్తంగా ఉంది. బుధవారం ముథోల్ మండలం చింతకుంట వాసులు మండల పరిషత్తు కార్యాలయానికి వచ్చి తమకు ఉచిత సిలెండర్ పథకం డబ్బులు రావడం లేదని, దరఖాస్తు రసీదు ఎంపీడీఓ శివకుమార్‌కు చూపించారు. ఆయన ఆన్‌లైన్‌లో పరిశీలిస్తే అందులో నమోదై లేదు. ఇలాంటి సమస్యలు చాలానే ఉన్నాయని, ప్రస్తుతం నమోదుకు అవకాశం లేదని బాధితులకు చెప్పారు. ప్రభుత్వం అవకాశం ఇస్తేనే ఇలాంటి సమస్యలు పరిష్కారమవుతాయని, ఇందులో తమ పరంగా చేసేదేమీ ఉండదని చెప్పి పంపించారు.

ప్రజల రక్షణ కోసమే పోలీసులు

లక్ష్మణచాంద, న్యూస్‌టుడే: ప్రజల రక్షణ కోసమే పోలీసులు పనిచేస్తున్నారని డీఎస్పీ గంగారెడ్డి అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం పురస్కరించుకుని లక్ష్మణచాంద పోలీస్ స్టేషన్‌లో ఓపెన్‌హౌస్ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయుధాలను ప్రదర్శించారు. ఆయా పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులకు ఆయుధాల పనితీరు వివరించారు. పోలీసు చట్టాల గురించి వివరించారు. విధి నిర్వహణలో అమరులైన పోలీసుల గురించి తెలియజేశారు. సోన్ సీఐ నవీన్‌కుమార్, ఎస్సై సుమలత, సందీప్, గోపీ, శిక్షణ ఎస్సై శ్రావణి పాల్గొన్నారు.


ఆయుధాల పనితీరు వివరిస్తున్న డీఎస్పీ గంగారెడ్డి, పక్కన సీఐ, ఎస్సైలు

మానసిక ఆరోగ్యానికి మించిన సంపద లేదు

నిర్మల్: మానసికంగా దృఢంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉన్నట్లని జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమం అధికారి డా.సురేశ్ అల్లాడి అన్నారు. ఖైదీలలో మానసిక ఆరోగ్యం పెంపొందించడానికి బుధవారం స్థానిక జిల్లా స్పెషల్ సబ్ జైలులో నిర్వహించిన స్ట్రెస్ మేనేజ్‌మెంట్ కార్యక్రమంలో మాట్లాడారు. మానసిక ఆరోగ్యానికి మించిన సంపద మరొకటి లేదని, చిన్న చిన్న సమస్యలకు భయపడకుండా ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు. మానసిక ఒత్తిడితో బాధపడేవారు టోల్ ఫ్రీ నెంబరు 14416కు ఫోన్ చేసి ఉచిత కౌన్సిలింగ్ సదుపాయం పొందాలన్నారు. సీనియర్ సివిల్ జడ్జి జి.రాధిక మాట్లాడుతూ ఖైదీలు జైలులో ఉన్నప్పుడు మానసిక ఎదుగుదలకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. జైలు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డా.సురేశ్ అల్లాడి, చిత్రంలో సీనియర్ సివిల్ జడ్జి జి.రాధిక

విద్యాలయాలకు నూతన కళ

● విధుల్లో గురువులు.. తీరిన విద్యా కష్టాలు

సర్కారు విద్యాలయాల బలోపేతానికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుంది. ఏళ్లుగా ఎదురుచూస్తున్న పలు సమస్యలకు పరిష్కారం చూపడంతో బడులు నూతన కళను సంతరించుకున్నాయి. కొన్నేళ్లుగా బోధించే వారు లేక పిల్లలకు పూర్తి స్థాయిలో విద్యాబోధన అందక పలు ఇక్కట్లు ఎదురయ్యాయి. వాటన్నింటినీ దూరం చేస్తూ బోధకుల నియామకం, పదోన్నతులు, పర్యవేక్షణ కోసం మండలానికి ఒక ఎంఈవో నియామకం వంటి వాటితో మేలు చేకూరింది -న్యూస్‌టుడే, నిర్మల్ అర్బన్

ఏళ్లుగా..


ఉపాధ్యాయులు కొన్నేళ్లుగా పదోన్నతుల కోసం ఎదురుచూపులు చూశారు. అర్హులకు పదోన్నతులు కల్పించి బదిలీలు చేపట్టిన విషయం తెలిసిందే. జిల్లాలో 19 మండలాలకు అయిదుగురు ఇన్‌ఛార్జి ఎంఈవోలే ఉండేవారు. దూరభారంతో పర్యవేక్షణకు పలు ఇక్కట్లు ఎదురయ్యాయి. మండలానికి ఒకరు చొప్పున ప్రధానోపాధ్యాయులను ఎంఈవోలుగా నియమించడంతో ఆ సమస్య తొలగింది. డీఎస్సీ కోసం వేచి చూస్తున్న అభ్యర్థుల కల నెరవేర్చింది. ఈ నెల 15న 278 మంది ఉపాధ్యాయులకు నియామక ఉత్తర్వులు ఇచ్చారు. కేజీబీవీ, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న సీఆర్టీ, పీజీసీఆర్టీలకు మంగళవారం నియామక పత్రాలు అందివ్వడంతో వారూ విధుల్లో చేరారు. పూర్తి స్థాయిలో గురువులు అందుబాటులోకి రావడంతో పిల్లల విద్యా కష్టాలు దూరమయ్యాయి.

నియామకమైన వారు

హోదా	సంఖ్య
స్కూల్ అసిస్టెంట్	67
ఎస్జీటీ	204
పీఈటీ	04
భాషాపండితులు	03
పీజీసీఆర్టీ	09
సీఆర్టీ	06
యూఆర్ఎస్(సీఆర్టీ)	01

● విద్యాలయం ● సంఖ్య

విద్యాలయం	సంఖ్య
పాఠశాలలు	735
కేజీబీవీ	18
యూఆర్ఎస్	01


పీజీసీఆర్టీ, సీఆర్టీలకు నియామక ఉత్తర్వులు అందజేస్తున్న డీఈవో రవీందర్‌రెడ్డి

విద్యార్థులకు ఎంతో మేలు:

రవీందర్‌రెడ్డి, డీఈఓ

విద్యాలయాల్లో గురువుల పోస్టులు భర్తీ కావడంతో విద్యార్థులకు పూర్తి స్థాయిలో చదువులు అందుతున్నాయి. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో వారికి ఎంతో మేలు కలిగింది. విధుల్లో చేరిన వారందరూ పిల్లల విద్యాభ్యున్నతికి పాటుపడాలని ఇప్పటికే సూచనలు, సలహాలిచ్చాం. వారికి ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూస్తున్నాం. మంచి ఫలితాలు సాధించేలా ముందుకెళ్తున్నాం.

యువతుల స్ఫూర్తి.. చైతన్య దీప్తి

● పశువైద్యాధికారులుగా కొలువులు

ఆడపిల్ల గడప దాటకూడదు. అది గతం. ఆకాశమే హద్దు ఇది ప్రస్తుతం. రంగమేదైనా.. పోటీ ఎంతైనా.. అవకాశాలు అందిపుచ్చుకుంటూ అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. వ్యవసాయ కుటుంబాల నుంచి వచ్చిన వారే అయినా కష్టపడి చదివారు. అనుకున్న లక్ష్యాన్ని సాధించారు.. పశువైద్యులుగా ఎంపికయ్యారు. ఉమ్మడి జిల్లాలో 18 మంది పశువైద్యాధికారులుగా బాధ్యతలు తీసుకోగా, అందులో పది మంది మహిళలు ఉన్నారు. వారి విజయగాథపై ప్రత్యేక కథనం. -న్యూస్‌టుడే, ఆదిలాబాద్ వ్యవసాయం :

మూగజీవాల బాధ కదిలించింది..

-లావణ్య, ఆదిలాబాద్



ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం కుచులాపూర్‌కు చెందిన లావణ్యది వ్యవసాయ కుటుంబం. చిన్నప్పటి నుంచి చదువులో చురుగ్గా ఉండే వారు. అయిదో తరగతిలో నవోదయకు ఎంపికయ్యారు. గతంలో వారికి డెయిరీ ఉండటంతో పశువులకు వచ్చే వ్యాధుల పట్ల కొంత అవగాహన ఉంది. అప్పట్లో వాటికి చికిత్స చేసేందుకు వచ్చే వైద్యులు, వారి సేవలను గమనించిన లావణ్య పశు వైద్యాధికారి కావాలని అనుకున్నారు. ఆ దిశగా చదువుకొని కళాశాలలో సీటు పొందారు. టీఎస్‌పీఎస్సీ పరీక్ష రాసి పశువైద్యాధికారిగా ఎంపికయ్యారు. "చిన్నప్పుడు గ్రామంలో వందల సంఖ్యలో మూగ జీవాలు ఉండేవి. వాటికి వచ్చే వ్యాధుల గురించి గ్రామస్థులకు అవగాహన లేక సకాలంలో చికిత్స చేయక కొన్ని చనిపోయేవి. వాటి బాధ నాలో ఆలోచన కలిగించింది. అందుకే పశువైద్యాధికారి కావాలని అనుకున్నాను. సాధించానంటున్నారు లావణ్య".

ఉన్నత స్థానానికి చేరుకోవాలని..

-అంజలి, కుమురం భీం



కుమురం భీం జిల్లా కౌటల మండలం ముత్యంపేట పశువైద్యశాలలో అంజలి పశువైద్యురాలిగా బాధ్యతలు తీసుకున్నారు. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన ఈమె పదో తరగతి వరకు మంచిర్యాలలో చదివారు. ఇంటర్ ప్రైవేట్ పాఠశాలలో చదివారు. తర్వాత ఎంట్రెన్స్ రాయడంతో బీవీఎస్సీలో సీటు రావడంతో హైదరాబాద్‌లో అయిదేళ్ల పాటు చదివారు. తర్వాత పీజీ చేసేందుకు కేరళకు వెళ్లారు. టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్ రావడంతో పీజీ మధ్యలో వదిలేసి సాధన చేసి మంచి మార్కులతో పాసై పశువైద్యురాలిగా ఎంపికయ్యారు. "ఉన్నత స్థానానికి చేరుకోవాలనే లక్ష్యంతో పట్టుదలతో చదవడంతోనే ఇది సాధ్యమైంది. మూగజీవాలంటే ఇష్టం. వాటికి సేవ చేయాలనే ఆశయంతో బీవీఎస్సీ కోర్సులో చేరాను. వాటికి వైద్యం అందించి కాపాడేందుకు ప్రయత్నిస్తానంటున్నారు అంజలి".

సేవతోనే సంతృప్తి..

-సంధ్యారాణి, మంచిర్యాల



మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలానికి చెందిన సంధ్యారాణి వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చారు. పదో తరగతి వరకు కిష్టాపూర్ ప్రభుత్వ పాఠశాలలో చదివారు. తర్వాత ఇంటర్ పూర్తి చేసి ఎంట్రెన్స్ రాయడంతో బీవీఎస్సీలో సీటు వచ్చింది. అయిదేళ్ల కోర్సు పూర్తి చేసుకున్న ఏడాదికి టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్ జారీ అయింది. పరీక్ష రాసి పాసై పశువైద్యాధికారిగా ఉద్యోగం వచ్చింది. 'నోరు లేని మూగజీవాలకు సేవ చేయడంలోనే సంతృప్తి ఉంది. గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి ఉద్యోగం చేయాల్సి ఉంటుంది. ఆడపిల్లలకు కష్టం అవుతుందని చాలా మంది చెప్పారు. అయినా గ్రామీణ ప్రాంతాల్లో పశువైద్యం అందించాలనే లక్ష్యంతో ఉద్యోగంలో చేరానంటున్నారు సంధ్యారాణి".

ఏడేళ్లు వేచి చూశా...

- ప్రియాంక, నిర్మల్



నిర్మల్ జిల్లా లక్ష్మణచాందకు చెందిన ప్రియాంక పదో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివారు. ఎక్కువ మార్కులు రావడంతో ఇంటర్ విద్యను ఉచితంగా ఓ కళాశాల అందించడంతో పూర్తి చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో పుట్టి పెరగడంతో వ్యవసాయం, పశువులపై అవగాహన ఉండేది. కష్టపడి బీవీఎస్సీ (బ్యాచిలర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్) కోర్సులో చేరి పూర్తి చేశారు. ప్రభుత్వం పశువైద్యుల పోస్టులు భర్తీ చేయకపోవడంతో ఒప్పంద పద్ధతిలో నిర్మల్ జిల్లాలో ఏడేళ్ల పాటు పని చేశారు. తర్వాత టీఎస్‌పీఎస్సీ పరీక్ష రాసి పశువైద్యాధికారిగా ఎంపికయ్యారు.

"మూగజీవాలపై ప్రేమతోనే ఈ వృత్తిని ఎంచుకున్నాను. బీవీఎస్సీ పూర్తి చేసుకున్న తర్వాత నోటిఫికేషన్ రాక ఏడేళ్లు పలు మండలాల్లో పని చేశాను. పశువులకు వచ్చే వ్యాధులు, ప్రభుత్వ కార్యక్రమాలపై అవగాహన ఉంది. ఇష్టంగా చేస్తే.. ఏ వృత్తి అయినా.. కష్టమేమి అనిపించదంటున్నారు

ఇన్‌స్పైర్‌లో మనోళ్ల జోరు!



● మంచిర్యాల రెండు, కుమురంభీం జిల్లాకు నాలుగో స్థానం

● ఉమ్మడి జిల్లాలో 3,533 రిజిస్ట్రేషన్లు

న్యూస్‌టుడే, ఆసిఫాబాద్ అర్బన్

ఇన్‌స్పైర్ మనక్ 2024-25 ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లలో మన విద్యార్థులు ఉత్సాహం కనబరిచారు. ఉమ్మడి జిల్లా నుంచి ఏకంగా 3,533 ప్రాజెక్టుల కోసం నామినేషన్లు నమోదయ్యాయి. 92.2 శాతంతో మంచిర్యాల రాష్ట్రంలో రెండో స్థానం, 88.1 శాతంతో కుమురం భీం జిల్లా నాలుగో స్థానంలో నిలిచింది. 2023-24లో నమోదైన ప్రాజెక్టుల్లో కుమురం భీం జిల్లా నుంచి 108 జిల్లా స్థాయి ప్రదర్శనకు ఎంపిక కాగా వచ్చే నెలలో ప్రదర్శించేందుకు సిద్ధమవుతున్నారు.



జూన్‌లో ఇన్‌స్పైర్ మనక్ జాతీయ పోటీల్లో పాల్గొన్న అక్షర పటేల్

కేంద్ర ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక అభివృద్ధి మంత్రిత్వశాఖ ఏటా దేశ వ్యాప్తంగా నిర్వహించే ఇన్‌స్పైర్ (ఇన్నోవేషన్ ఇన్ సైన్స్ పర్స్యూట్ ఫర్ ఇన్‌స్పైర్డ్ రీసర్చ్), మనక్ (మిలియన్ మైండ్స్ అడ్వంటింగ్ నేషనల్ ఆస్పిరేషన్ అండ్ నాలెడ్జ్) విద్యార్థుల్లో సృజనకు పదును పెడుతోంది. నిత్యం జీవితంలో ఎదురయ్యే సమస్యలకు వారు చూపించే పరిష్కారాల ప్రాజెక్టుల రిజిస్ట్రేషన్లను ఆన్‌లైన్‌లో ఆహ్వానిస్తోంది. జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఎంపికైన ప్రాజెక్టుల్లో అత్యుత్తమమైన వాటిని జాతీయ పోటీలకు ఎంపిక చేస్తుంది. జాతీయ స్థాయిలో ఎంపికైన వాటిని జపాన్‌లో జరిగే అంతర్జాతీయ సుకురా ప్రదర్శనలకు పంపుతారు.

ఎంపిక ఇలా..

జిల్లాలోని అన్ని యాజమాన్యాల ఉన్నత పాఠశాలల్లో చదివే 6-10 తరగతుల విద్యార్థులు అర్హులు కాగా.. ప్రతి పాఠశాల నుంచి 5 ప్రాజెక్టులను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి. ఇందులో నుంచి 10శాతం ఉత్తమ ప్రాజెక్టులుగా ఎంపిక చేస్తారు. ఎంపికైన విద్యార్థుల బ్యాంకు ఖాతాలో ప్రాజెక్టు తయారీ ఖర్చుల కోసం రూ.10వేల చొప్పున జమచేస్తారు. గైడ్ టీచర్ సహాయంతో విద్యార్థులు దీన్ని సిద్ధం చేసి జిల్లా స్థాయి పోటీల్లో ప్రదర్శించాలి. జిల్లా స్థాయి ప్రదర్శనల్లో 11 ఉత్తమమైన వాటిని ఎంపిక చేసి రాష్ట్ర స్థాయికి పంపించనున్నారు.

ఇదీ ప్రయోజనం

జాతీయ స్థాయిలో జ్యూరీని ఆకట్టుకొని ఎంపికయ్యే అత్యుత్తమ 60 ప్రాజెక్టుల విద్యార్థులకు రాష్ట్రపతి స్థాయిలో గుర్తింపు లభిస్తుంది. ఈ విద్యార్థులకు రాష్ట్రపతి భవన్‌లో విందు ఏర్పాటు చేస్తారు. వీరి ప్రాజెక్టులకు పేటెంట్ హక్కును కల్పిస్తారు. వీరికి దేశంలో పేరున్న ఐఐటీల్లో ప్రవేశాలకు రిజర్వేషన్ కల్పిస్తారు.

జాతీయ స్థాయిలో మెరిసిన విద్యార్థులు

గతేడాది నవోదయ విద్యాలయానికి చెందిన 9వ తరగతి విద్యార్థిని ముకుం అక్షర పటేల్ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంది. వరిగడ్డి కాల్చి వాయు కాలుష్యానికి కారణం కాకుండా ఆ గడ్డితో మొక్కలు పెంచే కుండీల తయారీకి వినియోగించవచ్చని నిరూపించే ప్రాజెక్టుతో ఆకట్టుకుంది.

ఉమ్మడి జిల్లాలో నమోదైన ఇన్‌స్పైర్ నామినేషన్లు

మంచిర్యాల	కుమురం భీం	నిర్మల్	ఆదిలాబాద్
1308	768	894	563
92.2	88.1	71.6	37.3

● జిల్లా ● నామినేషన్లు ● శాతం

వచ్చే నెలలో ప్రదర్శనలు

కటుకం మధుకర్, జిల్లా సైన్సు అధికారి, కుమురంభీం

ఈ సారి జిల్లా నుంచి 768 ప్రాజెక్టులు నమోదవడం సంతోషకరం. వచ్చే నెల మూడో వారంలో జిల్లా స్థాయి ప్రదర్శన పోటీలు ఉంటాయి. ప్రధానోపాధ్యాయులు, గైడ్ టీచర్లు ఈ విషయంలో తగు శ్రద్ధ తీసుకోవాలి.

నేడు ఏనుగు పండగ

● మహారాష్ట్ర సరిహద్దులో కొనసాగుతున్న సంప్రదాయం

న్యూస్‌టుడే, బేల :

దీపావళికి ముందు వచ్చే అష్టమి రోజు ఆదిలాబాద్ జిల్లావాసులు ఏనుగును పూజిస్తారు. గజేంద్రున్ని దైవంగా భావించి తరాలుగా పూజిస్తున్నారు. మహారాష్ట్ర సరిహద్దులో ఉండే బేల, జైనథ్, తాంసి మండలాల్లో ఈ ఆచారం కనిపిస్తుంది. ఆయా మండలాల్లోని మరాఠీ భాష మాట్లాడే ప్రజలు ఈ సంప్రదాయాన్ని తరాలుగా కొనసాగిస్తున్నారు. బహుళ అష్టమి నాడు ఏనుగు వ్రతం నిర్వహిస్తారు. మట్టితో ఏనుగు ప్రతిమలు తయారు చేస్తారు. గురువారం ఈ పండగను నిర్వహించనున్నారు.



మట్టితో తయారు చేసిన ఏనుగు విగ్రహం

ఎందుకు పూజిస్తారు..

ఈ పండగ వెనుక ఓ పౌరాణిక గాథ ఉందంటారు. ఒకసారి పార్వతీదేవి శివుడిపై అలిగి కైలాసం వదిలి వెళ్లిపోయిందట. కొన్ని రోజుల తర్వాత శివుడు ఏనుగు(గజేంద్రుడు)ను పంపి పార్వతీ దేవిని రమ్మని అన్నాడట. అప్పుడు పార్వతీ దేవి సంతోషంతో గజేంద్రుడిపై కూర్చొని తిరిగి శివుడి దగ్గరకు కైలాసానికి వచ్చిందట. ఈ అష్టమి నాడు ఏనుగును పూజిస్తే పార్వతీదేవి అనుగ్రహం లభిస్తుందని భక్తుల విశ్వాసం. ఐశ్వర్యాలు, సంపూర్ణ ఆరోగ్యం కలుగుతాయని భావిస్తారు. నియమ నిష్ఠలతో ఏనుగును పూజిస్తారు.

తాళసప్తమి వేడుకలు ప్రారంభం



సప్తమి వేడుకల్లో భజన చేస్తున్న భజనకారులు

కుభీరు: మండలంలోని పార్డి(కె) గ్రామ హనుమాన్ ఆలయంలో వారం రోజుల పాటు నిర్వహించే తాళసప్తమి వేడుకలు బుధవారం ప్రారంభమయ్యాయి. అర్చకులు ఆలయంలోని హనుమంతుడి ప్రతిమకు అభిషేకం, ప్రత్యేకపూజలు చేశారు. భజనకారుల భజనల మధ్య సప్తమి వేడుకలు ప్రారంభించారు. గ్రామస్థులు వంతుల వారీగా సప్తమి వేడుకల్లో పాల్గొంటారు. ప్రతిరోజు రాత్రి ప్రముఖ మహారాజ్‌ల కీర్తన, రాత్రికి అన్నదానం, హరిపాఠ్ పారాయణం, కాగడా హారతి నిర్వహిస్తారు. ఈనెల 30న ముగింపు వేడుకలు గ్రామంలో శోభాయాత్ర, ఉట్టిపగులగొట్టే కార్యక్రమం, మహాప్రసాదం ఉంటుందని ఆలయకమిటీ అధ్యక్షుడు బందెల శంకర్ తెలిపారు. మాజీ సర్పంచి ఆకుల గంగాధర్, ఆలయకమిటీ ప్రతినిధులు గంటా రాములు, లంక పోశెట్టి, మరాఠి బాబు, ఆకుల వెంకటి, గోజల గజ్జారాం, లంక సురేశ్, భజనకారులు పాల్గొన్నారు.

ఆలోచన అదిరే.. చిత్రాలతో మెరిపించే

● అధునాతన యంత్ర సహకారం.. అబ్బురపర్చే పనితనం

నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే:

చేసే పనిలో నిబద్ధత.. కొత్తదనం కోసం ప్రయత్నిస్తే మంచి ఫలితాలు వస్తాయి. అలా వినూత్న పంథాలో వెళ్లి సరికొత్త రూపంలో చిత్రాలు వేస్తూ అబ్బురపరుస్తున్నారు నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన పోతుల శ్రీనివాస్. ఎంబ్రాయిడరీలో రంగురంగుల దారాలతో ఆధునిక యంత్రంపై వీటిని తీర్చిదిద్దుతున్నారు. ఒక్కో చిత్రానికి గంటల సమయం పడుతున్నా తనలోని కళాత్మక ధోరణితో వాటిని తయారు చేస్తున్నారు. ఇప్పటికే పలువురు ప్రముఖుల చిత్రాలు రూపొందించి వాటిని వారికి అందజేసి ప్రశంసలు సైతం అందుకున్నారు.

ఉపాధి నిమిత్తం

ఖమ్మం జిల్లా వైరాకు చెందిన పోతుల శ్రీనివాస్ టైలరింగ్ వృత్తిలో ఉపాధి నిమిత్తం 20 ఏళ్ల క్రితం నిర్మల్ పట్టణానికి వచ్చారు. భార్య అనిత ఈయనకు తోడ్పాటుగా నిలిచారు. కాలానికి అనుగుణంగా తమ వృత్తిలోనూ మార్పులు అందిపుచ్చుకుంటూ ఎంబ్రాయిడరీ చేసే చిన్న యంత్రాన్ని కొనుగోలు చేశారు. దానిపై జాకెట్లకు వివిధ ఆకృతుల్లో ఎంబ్రాయిడరీ చేసేవారు. రెండేళ్ల క్రితం సరికొత్తగా వచ్చిన మరో మిషన్ కొన్నారు. దానిపై ఎంబ్రాయిడరీతోపాటు చిత్రాలు వేయొచ్చు. ఆ పనిపై అవగాహన, శిక్షణ పొంది ఏడాది క్రితం ఫొటోలు వేయడం ప్రారంభించారు.

ఒక్కో చిత్రానికి 16-18 గంటలు

నాణ్యమైన పట్టు వస్త్రాలపై చిత్రాలను వేస్తున్నారు. ఒక్కటి తయారు కావాలంటే సుమారు 16-18 గంటల సమయం పడుతుంది. ఇందుకు ఎంతో శ్రమిస్తున్నారు. ఏ మాత్రం అశ్రద్ధగా ఉన్నా శ్రమ వృథా అయ్యే ప్రమాదం ఉంటుందని శ్రీనివాస్ చెబుతున్నారు. అందుకే దగ్గరుండి మరీ పర్యవేక్షిస్తూ వాటిని తయారు చేస్తున్నారు. భార్యతోపాటు కుమారులు డిగ్రీ పూర్తి చేసిన కార్తిక్, మాధ్యమిక విద్యనభ్యసిస్తున్న అఖిల్ సాయం చేస్తున్నారు. ఏడాది కాలంలో ఇప్పటి వరకు సుమారు 105 చిత్రాలు వేశారు.




యంత్రం వేస్తున్న చిత్రాన్ని దగ్గరుండి పర్యవేక్షిస్తున్న శ్రీనివాస్

ప్రముఖుల ప్రశంసలు..

సీఎం రేవంత్‌రెడ్డి, ఏపీ, తెలంగాణ ఉప ముఖ్యమంత్రులు భట్టి విక్రమార్క, పవన్‌కల్యాణ్, మంత్రి సీతక్క, మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్, తిరుపతి ఎమ్మెల్యే శ్రీనివాస్ ఇలా ఎందరివో చిత్రాలు వేశారు. ఆయనలోని కళను గుర్తించి ఇప్పటికే ప్రముఖుల నుంచి ప్రశంసలు అందుకున్నారు. నాణ్యమైన సిల్క్‌పై చిత్రం వేయడంతో శాశ్వతంగా ఉంటాయని శ్రీనివాస్ చెబుతున్నారు. త్వరలో ప్రదర్శన ఏర్పాటు చేసే ఆలోచన ఉందని పేర్కొన్నారు. ఒక చిత్రం వేసే సమయంలో అనేక జాకెట్లకు ఎంబ్రాయిడరీ చేసి డబ్బు సంపాదించవచ్చని, కానీ ఈ కళపై ఆసక్తితో పలు గంటలు శ్రమిస్తున్నానని, తన పనికి లభిస్తున్న ప్రశంసలే తనకు ఇంధనమవుతోందని చెప్పారు.



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటం



తల్లితో ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటం

పాఠశాలలకు పాలు సరఫరా చేయాలి: పీవో



లవణ మిశ్రమ ప్యాకెట్‌ను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

నిర్మల్, న్యూస్‌టుడే: ఐటీడీఏ నిర్వహిస్తున్న పాఠశాలలకు పాలు సరఫరా చేయాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా డెయిరీ నిర్వాహకులను కోరారు. బుధవారం నిర్మల్‌లోని విజయ పాల కేంద్రాన్ని సందర్శించారు. సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ సహకారంతో తెలంగాణలోని సహకార రంగంలో పర్యావరణహితంగా ఏర్పాటుచేసిన లవణ కర్మాగారం, పాల ప్యాకింగ్ యూనిట్లను పరిశీలించారు. గిరి విజయమిన్ ప్లాంటు నిర్వహిస్తున్న బృంద సభ్యులు చందు, మానసలను లవణ మిశ్రమ తయారీ, అమ్మకాలను అడిగి తెలుసుకున్నారు. విజయ పాల ప్యాకింగ్ ప్లాంటును సందర్శించి ఐటీడీఏ ద్వారా నలుగురు గిరిజన యువతకు నియామక పత్రాలు అందజేసి ఉపాధి కల్పించారు. రోజూ వారీ పాల సేకరణ, ప్యాకింగ్ సమాచారం, రైతులకు అందజేస్తున్న దాణా, లవణ మిశ్రమం, గడ్డి విత్తనాలను పరిశీలించారు. త్వరలో కాగజ్‌నగర్‌లో బల్క్ కూలింగ్ యూనిట్ ప్రారంభిస్తున్నామని చెప్పారు. అనంతరం జీసీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సోఫీనగర్‌లోని పెట్రోల్ బంక్‌ను సందర్శించారు. జేడీఎం నాగభూషణం, పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్ బాలిక్ అహ్మద్, జీసీసీ డీఎం రామానందం, విజయ డెయిరీ డీడీ మధుసూదన్, మేనేజర్ దస్రునాయక్, గజ్జారాం, సంతోష్, కాంతారావ్, పంపిణీదారులు రమణారెడ్డి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

అమృత్ పథకంతో ప్రజలకు మంచినీరు



పనులను పర్యవేక్షిస్తున్న పుర ఛైర్మన్ సత్యం, అధికారులు

ఖానాపూర్: అమృత్ 2 పథకంతో చేపట్టనున్న మంచినీటి ట్యాంకుల నిర్మాణంతో పట్టణ ప్రజలకు శుద్ధ జలం అందనుందని మున్సిపల్ ఛైర్మన్ చిన్నం సత్యం అన్నారు. పట్టణంలోని గాంధీనగర్‌లో ప్రారంభమైన మంచినీటి ట్యాంకుల నిర్మాణ పనులను బుధవారం పరిశీలించారు. ఎమ్మెల్యే బొజ్జుపటేల్ సహకారంతో 5 లక్షల లీటర్ల సామర్థ్యం గల ట్యాంకులు మంజూరయ్యాయని అన్నారు. వైస్ ఛైర్మన్ సంతోష్, నాయకులు సురేష్, షబ్బీర్‌పాషా, కమిషనర్ మనోహర్, సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్షల నిర్వహణ పరిశీలన

నిర్మల్ గ్రామీణం: మండలంలోని అనంతపేట్ శివారు కస్తూర్బాగాంధీ విద్యాలయంలో నిర్వహిస్తున్న సంగ్రహనాత్మక మూల్యాంకనం-1 (ఎస్ఏ-1) పరీక్షల నిర్వహణ తీరును బుధవారం డీఈవో రవీందర్‌రెడ్డి పరిశీలించారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం

నిర్మల్ గ్రామీణం: క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోవాల్సిన అవసరముందని జిల్లా వైద్యాధికారి రాజేందర్ అన్నారు. క్యాన్సర్ వ్యాధిపై అవగాహన వారోత్సవాల్లో భాగంగా బుధవారం లయన్స్ క్లబ్ ఆఫ్ నిర్మల్ ఆధ్వర్యంలో చేతిప్రతులను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యక్రమ నిర్వహణాధికారులు డా. శ్రీనివాస్, డా. సౌమ్య, లయన్స్ క్లబ్ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు కూనింటి చంద్రమోహన్‌రెడ్డి, కోశాధికారి లక్ష్మీనారాయణ గౌడ్, జోన్ ఛైర్మన్ ఎల్.రాజేశ్వర్‌రెడ్డి, డైరెక్టర్ నేరేళ్ల హనుమంతు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

నిర్మల్: జిల్లాలో అధిక ఫీజులు వసూలు చేస్తున్న జూనియర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ (టీజీవీపీ) నాయకులు బుధవారం మాధ్యమిక జిల్లా విద్యాధికారి పరశురామ్‌కు వినతిపత్రం అందజేశారు. సంఘ పట్టణ కో-కన్వీనర్ జాదవ్ మిథున్, ఈక్షిత్, కరణ్‌బాబు, గణేశ్, రామ్‌రాజ్ పాల్గొన్నారు.

ఓటు నమోదు చేసుకోండి

లోకేశ్వరం: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఉపాధ్యాయులందరూ ఓటు నమోదు చేసుకోవాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు తోట నరేంద్రబాబు అన్నారు. లోకేశ్వరం ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో బుధవారం ఉపాధ్యాయులకు ఓటు నమోదు పత్రాలను పంపిణీ చేశారు.

తానూరు బంద్ ప్రశాంతం

తానూరు(భైంసా), న్యూస్‌టుడే: ఆలయాలపై దాడులను నిరసిస్తూ బుధవారం తానూరు మండల కేంద్రంలో భజరంగ్‌దళ్, హిందూ వాహిని, భగత్ సింగ్ యువజన సంఘం పిలుపు మేరకు దుకాణాల యజమానులు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. ఈ సందర్భంగా హిందూ సంఘాల నాయకులు తహసీల్దారు లింగమూర్తికి వినతిపత్రం అందించి, దేవాలయాలపై దాడులను నివారించాలని కోరారు. ఎలాంటి సమస్య తలెత్తకుండా ఎసై డి.రమేశ్ ఆధ్వర్యంలో పోలీసులు భద్రత చర్యలు చేపట్టారు.

కాంగ్రెస్ నాయకురాలికి ప్రశంసాపత్రం



ప్రశంసాపత్రం అందుకుంటున్న అల్లూరి కృష్ణవేణి

నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ మహిళా సభ్యత్వ నమోదులో రాష్ట్రంలోనే ఆ పార్టీ నిర్మల్ జిల్లా మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు అల్లూరి కృష్ణవేణి ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా దిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ మహిళా విభాగం జాతీయ అధ్యక్షురాలు అల్కా లాంబ, హరియాణా రాష్ట్రం జులానా ఎమ్మెల్యే వినేశ్ ఫొగాట్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతరావు ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు.

27న ఖానాపూర్‌లో పథసంచలన్

ఖానాపూర్: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఖానాపూర్ ఖండ ఆధ్వర్యంలో ఈ నెల 27న పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో 'విజయదశమి పథ సంచలన్' ఉత్సవాన్ని నిర్వహించనున్నట్లు భజరంగ్‌దళ్, వీహెచ్‌పీ, హిందూ ఉత్సవ సమితి సభ్యులు తెలిపారు. ఖానాపూర్, పెంబి, కడెం, దస్తూరాబాద్, మండలాల్లోని సంఘం, వివిధ క్షేత్రాల కార్యకర్తలందరూ గణవేశ(సంఘం యూనిఫాం)లో హాజరు కావాలని కోరారు.

సమతుల ఆహారంతో ఆరోగ్యం

దస్తూరాబాద్: సమతుల ఆహారంతో ఆరోగ్యాన్ని పొందుతారని దస్తూరాబాద్ పీహెచ్‌సీ వైద్యుడు విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని ఆకొండపేట, పెర్కపల్లె అంగన్‌వాడీ కేంద్రాలకు చెందిన తక్కువ బరువు ఉన్న పిల్లలను ఆసుపత్రికి తీసుకెళ్లి వివిధ ఆరోగ్య పరీక్షలు చేయించారు. తీసుకొనే ఆహార అలవాట్లపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు రాధ, హెచ్‌వీ లలిత, అంగన్వాడీ కార్యకర్తలు రాజమణి, గీతాంజలి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

28న జిల్లాకు బీసీ కమిషన్ బృందం రాక

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : ఈ నెల 28న బీసీ కమిషన్ బృందం ఆదిలాబాద్ జిల్లాకు రానుందని కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. జడ్పీ సమావేశ మందిరంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 వరకు కమిషన్ ఛైర్మన్ నిరంజన్ నేతృత్వంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపడతారని పేర్కొన్నారు. ఆదిలాబాద్‌తో పాటు నిర్మల్, మంచిర్యాల, కుమురంభీం జిల్లాల కుల సంఘాల ప్రతినిధులు హాజరుకావాలని కోరారు. రాతపూర్వకంగా అభ్యర్థనలు నిర్ణీత నమూనాలో తగు సమాచారంతో సమర్పించవచ్చని పేర్కొన్నారు. కమిషన్ సభ్యులు బుధవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించగా.. పాలనాధికారితో పాటు అదనపు పాలనాధికారి శ్యామలదేవి, బీసీ సంక్షేమాధికారి రాజలింగు పాల్గొన్నారు.

వైద్యుల నియామకానికి 29న ముఖాముఖి

ఆదిలాబాద్ వైద్య విభాగం: ఆదిలాబాద్ రాజీవ్ గాంధీ వైద్య విజ్ఞాన సంస్థ(రిమ్స్)లోని వివిధ విభాగాల్లో ఒప్పంద ప్రాతిపదికన ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ట్యూటర్లు, సీఎంఓ/సీఏఎస్ పోస్టులను భర్తీ చేయడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రిమ్స్ సంచాలకుడు డాక్టర్ రాఠోడ్ జైసింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు తమ నిజ ధ్రువపత్రాలతో పాటు రెండు సెట్ల జిరాక్స్ ప్రతులతో వాక్ ఇన్ ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. నియామకాలను మెరిట్, ఆర్‌ఓఆర్ నిబంధనల మేరకు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. వాక్ ఇన్ ఇంటర్వ్యూలు ఈ నెల 29న ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4 వరకు కొనసాగుతాయన్నారు. ఆయా విభాగాల్లో భర్తీ చేయనున్న వైద్యుల వివరాల కోసం adilabad.telangana.gov.in లేదా rimsadilabad.org వెబ్‌సైట్లను సందర్శించాలని సూచించారు. వివరాల కోసం 98480 57606 నెంబరును సంప్రదించాలన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా...

నిర్మల్ 97053 46693
భైంసా 63099 94649
ఖానాపూర్ 96401 62091

సమస్య: నిర్మల్‌లోని సాగర్‌కాలనీ రోడ్ నం.22లో వీధి దీపాలు వెలగక అంధకారం నెలకొంటోంది. - **ఆనంద్‌రావు, స్థానికుడు**

సమాధానం : క్షేత్రస్థాయిలో సిబ్బందితో పరిశీలింపజేయించి ఏర్పాటు చేయిస్తాం. - **సి.వి.ఎన్.రాజు, మున్సిపల్ కమిషనర్, నిర్మల్**

- న్యూస్‌టుడే, నిర్మల్ అర్బన్

నిధుల కొరత.. పడకేసిన పనులు

భైంసా గ్రామీణం, న్యూస్‌టుడే: నిధుల కొరత గ్రామ పంచాయతీలను వేధిస్తోంది. ప్రభుత్వం నుంచి సకాలంలో నిధులు రాక, బిల్లుల చెల్లింపులో జాప్యం శాపంగా మారుతోంది. పంచాయతీల్లోని ఆదాయ వనరులపై దృష్టి సారించి ఆ కొరతను అధిగమించాలని ఉన్నతాధికారుల ఆదేశం. పన్నుల వసూళ్లు, పత్రాల జారీ, తడి, పొడి చెత్తతో వర్మి కంపోస్టు ఉత్పత్తి, తదితర ఆదాయ వనరులను సమకూర్చుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.



మాంజ్రి గ్రామంలో రహదారిపై ప్రవహిస్తున్న మురుగు నీరు

☛ మండలంలోని మాంజ్రిలో మురుగునీటి పారుదల వ్యవస్థ సక్రమంగా లేక నీరు రహదారులపై ప్రవహిస్తోంది. దుర్గంధభరితంగా మారి దుర్వాసనతో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని గ్రామస్థులు వాపోతున్నారు. అంతర్గత రహదారుల నిర్వహణ సక్రమంగా లేక ముళ్లపొదలు దారులను కమ్మేస్తున్నాయి.

☛ మండలంలోని సుంక్లిలో బోరుబావుల్లోని ఒక త్రీఫేజ్ మోటారు, రెండు సింగిల్‌ఫేజ్ మోటార్లు చెడిపోయి నెల రోజులు గడిచినా నిధులు లేమితో మరమ్మతులకు నోచుకోవడం లేదు. నీటి లభ్యత ఉన్న చోటికి వెళ్లాల్సిన పరిస్థితులు దాపురించాయి. ఎస్సీ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక వర్షపు నీరు రహదారిపై పొంగి ప్రవహిస్తోంది.

☛సమస్యను సంబంధిత కార్యదర్శుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేస్తామని భైంసా ఎంపీడీఓ సుధాకర్ రెడ్డి చెప్పారు.

ఆలయాల వద్ద నిఘా నేత్రాలు ఏర్పాటు చేయాలి

భైంసా గ్రామీణం, న్యూస్‌టుడే: నేరాల నియంత్రణకు ముఖ్యమైన ప్రాంతాలు, ఆలయాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని భైంసా గ్రామీణ సీఐ ఎం.నైలు అన్నారు. భైంసా గ్రామీణ పోలీసు స్టేషన్‌లో బుధవారం ఆయా గ్రామాల వీడీసీ సభ్యులు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఏఎస్సై మారుతి, పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: గ్రామాల్లోని ప్రధాన ఆలయాల వద్ద నిఘా నేత్రాలు ఏర్పాటు చేయాలని ఎస్సై సుమలత అన్నారు. మండలంలోని బాబాపూర్ రాజరాజేశ్వరాలయం, వడ్యాల్ ఎల్లమ్మ ఆలయం, కనకాపూర్ వీరహనుమాన్ ఆలయాల వద్ద ఆయా గ్రామాల ప్రజలతో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తరచూ చోరీలు జరుగుతున్న నేపథ్యంలో ఆలయాల వద్ద భద్రతగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

సారంగాపూర్: ఆలయాల పరిరక్షణపై నిఘా ఉండాలని సారంగాపూర్ ఎస్సై సల్ల శ్రీకాంత్ అన్నారు. మందిరాల్లో చోరీల నేపథ్యంలో బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ప్రధాన ఆలయాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. అన్ని మందిరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

దస్తూరాబాద్: ఒక సీసీ కెమెరా 100 మందితో సమానమని ఎస్సై శంకర్ అన్నారు. బుధవారం మండలంలోని నాయకులు, దేవాలయాల కమిటీ సభ్యులతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమావేశం నిర్వహించారు.

సోన్: మండలంలోని దేవాలయాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సోన్ ఎస్సై గోపీ కోరారు. ఆయన బుధవారం దేవాలయాల కమిటీ సభ్యులు, వీడీసీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు.

మహాలక్ష్మీ ఆలయంలో ప్రత్యేక పూజలు



డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావును సన్మానిస్తున్న ఆలయ కమిటీ నాయకులు, తదితరులు

నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే: నిర్మల్ పట్టణం బంగల్‌పేట్ శ్రీ మహాలక్ష్మీ ఆలయంలో డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం అమ్మవారిని దర్శించుకుని పూజలు చేయగా, ఆలయ పూజారులు తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ కొడుకుల శ్రీకాంత్, సభ్యులు సన్మానించారు. అనంతరం నిర్మల్ మార్కెట్ యార్డును సందర్శించి నూతన పాలకవర్గాన్ని అభినందించారు. గ్రంథాలయ సంస్థ జిల్లా ఛైర్మన్‌గా ఇటీవల నియామకమైన సయ్యద్ అర్జుమంద్ అలీ డీసీసీ అధ్యక్షుడిని మర్యాదపూర్వకంగా కలువగా ఛైర్మన్‌ను సత్కరించారు. మార్కెట్ కమిటీ ఛైర్మన్ సోమ భీంరెడ్డి, వైస్ ఛైర్మన్ శ్రీనివాస్, దేవరకోట ఆలయ కమిటీ ఛైర్మన్ కొండా శ్రీనివాస్, నాయకులు కొట్టె శేఖర్, అజహర్, చిన్ను, రమణ, జునైద్, మతిన్, వేణుగోపాల్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదానికి గురైన విద్యార్థినికి ఆర్థిక సాయం



అనూషకు సాయం అందజేస్తున్న మార్కెట్ కమిటీ వైస్‌ఛైర్మన్ శ్రీనివాస్, సంస్థ సభ్యులు

లక్ష్మణచాంద, న్యూస్‌టుడే: పాముకాటుతో ప్రమాదానికి గురై ఆర్థికంగా చతికిలబడ్డ కుటుంబానికి వరల్డ్ విజన్ స్వచ్ఛంద సంస్థ రూ.50 వేలు ఆర్థిక సాయం అందజేసింది. మండలంలోని తిర్‌పెల్లికి చెందిన గాండ్ల అనూష ఇంట్లో నిద్రిస్తుండగా పాము కాటు వేసింది. గుర్తించేలోపే అపస్మారక స్థితిలోకి వెళ్లింది. చికిత్స కోసం రూ.3లక్షల వరకు ఖర్చయింది. నిర్మల్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో పది రోజుల పాటు చికిత్స పొంది కోలుకుని ఇంటికి వచ్చింది. నిరుపేద కుటుంబం కావటంతో అనూష పరిస్థితిని తెలుసుకున్న వరల్డ్ విజన్ స్వచ్ఛంద సంస్థ బుధవారం అనూష ఇంటికి వెళ్లి మార్కెట్ కమిటీ వైస్‌ఛైర్మన్ ఈటెల శ్రీనివాస్ చేతుల మీదుగా రూ. 50వేల చెక్కును అందజేసింది.

వృద్ధాశ్రమానికి చిన్నారుల బాసట



సాయం చేసిన చిన్నారులు

కడెం: మండలంలోని లింగాపూర్‌కు చెందిన శాంతినికేతన్ విద్యాలయంలో చదివే విద్యార్థులు తమ ఉదారతను చాటుకున్నారు. మంచిర్యాల జిల్లా నస్పూర్‌లో ఉన్న శ్రీసాయి అనాథ వృద్ధాశ్రమ వెల్ఫేర్ సొసైటీకి రూ.18,941 విరాళంగా అందజేశారు. ఆశ్రమంలోని వృద్ధుల అవసరాలు తీర్చేందుకు చిన్నారులు పోగుచేసుకున్న ఈ డబ్బులు విద్యాలయం ప్రిన్సిపల్ నిషిత విజయ్ ఆధ్వర్యంలో ఆశ్రమ నిర్వాహకులకు బుధవారం అందజేశారు.

ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలి

నిర్మల్ అర్బన్: ఆశా కార్యకర్తల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు అన్నారు. బుధవారం నిర్మల్‌లో నిర్వహించిన యూనియన్ జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడారు. అదనపు విధులు కేటాయించడం సరికాదని, పారితోషికం లేని పనులు చేయించకూడదని పేర్కొన్నారు. గతంలో పని చేసిన వాటికి సంబంధించిన పారితోషిక బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ. 18వేలు అందజేయాలన్న తదితర వాటిని నెరవేర్చాలని వెల్లడించారు. యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షురాలు సుజాత, అధ్యక్ష, కార్యదర్శి చంద్రకళ, గంగామణి, ఉపాధ్యక్షురాలు అనసూయ, నాయకులు పాల్గొన్నారు.

ఎంపీహెచ్‌డబ్ల్యూ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

సారంగాపూర్: నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం చించోలి(బి)లోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రంలో రెండేళ్ల కాల పరిమితితో మల్టీపర్పస్ హెల్త్ వర్కర్స్(ఎంపీహెచ్‌డబ్ల్యూ) కోర్సులో శిక్షణ ఇవ్వనున్నట్లు మేనేజర్ విజయలక్ష్మి తెలిపారు. ఇంటర్ ఉత్తీర్ణులై 18-35 ఏళ్ల వయసు కలిగిన మహిళలు ఈ నెల 25 లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పదోతరగతి, ఇంటర్ మెమోలు, ఆధార్‌కార్డు, కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు, రేషన్‌కార్డు, ఫిజికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్, 4 నుంచి పదో తరగతి వరకు బోనాఫైడ్ పత్రాలు, 6 ఫొటోలతో http:/// chfw.telangana.gov.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వాటి ప్రతులను మహిళా ప్రాంగణంలో నేరుగా అందజేయాలన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల అభ్యర్థులు దరఖాస్తులకు అర్హులని చెప్పారు. అదనపు సమాచారం కోసం చరవాణి నెంబరు 76600 22506ను సంప్రదించాలన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు: ఆర్డీవో

భైంసా, న్యూస్‌టుడే: మార్కెట్‌లో సరకు విక్రయానికి వచ్చే రైతులకు ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదని ఆర్డీవో కోమల్‌రెడ్డి అన్నారు. గాంధీగంజ్‌లోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం కమీషన్ ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. కొనుగోళ్లలో నిబంధనలు పాటించాలని, తూకాల్లో మోసాలు, చెల్లింపుల్లో కోతలు విధిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తహసీల్దారు టి.ప్రవీణ్ కుమార్, ఏడీఎం శ్రీనివాస్, ఉన్నత శ్రేణి కార్యదర్శి పురియానాయక్, ద్వితీయ శ్రేణి కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోలీసుల ఆధ్వర్యంలో రక్తదానం



రక్తదానం చేస్తున్న ఏఎస్పీ అవినాశ్‌కుమార్

భైంసా, న్యూస్‌టుడే: శాంతిభద్రతల పరిరక్షణతో పాటు సామాజిక సేవలను బాధ్యతగా తీసుకోవాలని ఏఎస్పీ అవినాశ్ కుమార్ అన్నారు. పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా బుధవారం ప్రాంతీయ ఆసుపత్రిలోని రక్తనిధి కేంద్రంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తాన్ని అందించారు. పలువురు సామాజిక కార్యకర్తలు, యువకులు, పోలీసులు రక్తదానం చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ యు.కాశీనాథ్, డా.అనిల్, పట్టణ, గ్రామీణ సీఐలు గోపీనాథ్, నైలు, తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో జీవితాల్లో వెలుగులు



రత్నాపూర్‌కాండ్లి పాఠశాలలో గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

నిర్మల్ గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రంథాలయంలోని విజ్ఞాన పుస్తకాలు చదివి ఆకళింపు చేసుకుంటే జీవితం మలుపులు తిరగడానికి ఆస్కారం ఉంటుందని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. బుధవారం మండలంలోని రత్నాపూర్ కాండ్లి ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన మోడల్ గ్రంథాలయాన్ని డీఈఓ రవీందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. రూమ్ టు రీడ్ ఇండియా సంస్థ అన్ని మండలాల్లో గ్రంథాలయాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. డీఈవో రవీందర్‌రెడ్డి, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి నర్సయ్య, మండల విద్యాధికారి వెంకటేశ్వర్లు, పాఠశాలల సమూహ ప్రధానోపాధ్యాయురాలు విజయస్వప్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

అభ్యంతరాల వివరాల జాబితా విడుదల

నిర్మల్ గ్రామీణం: ఆరోగ్య శాఖలో ఇటీవల పలు ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ప్రాథమిక జాబితాలో సవరణ, అభ్యంతరాలకు సంబంధించిన వివరాలను ఆరోగ్య శాఖ కార్యాలయంలో జాబితాను అంటించినట్లు జిల్లా వైద్యాధికారి డా.రాజేందర్ తెలిపారు. అదే జాబితాను www.nirmal.telangana.gov.in పోర్టల్‌లో పెట్టినట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు పరిశీలించుకోవాలని సూచించారు.

నిబంధనలు పాటించాలి

కుంటాల: వాహన చోదకులు రహదారి నిబంధనలు పాటించాలని ఎస్సై భాస్కరచారి అన్నారు. కుంటాల పోలీసు స్టేషన్‌లో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో భద్రతగా ఉంటుందని, గ్రామాభివృద్ధి కమిటీల ఆధ్వర్యంలో ఆ దిశగా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

పన్ను వసూళ్లపై దృష్టిపెట్టండి

కుంటాల: గ్రామాల్లో వంద శాతం పన్ను వసూలు చేయాలని ఎంపీడీఓ తాటికొండ లింబాద్రి కోరారు. కుంటాల మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీఓ అబ్దుల్ రహీం, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహారం అందించాలి

సోన్: మండలంలోని లెఫ్ట్ పోచంపాడ్ సాంఘిక సంక్షేమ గురుకుల వసతి గృహాన్ని జడ్పీ సీఈఓ గోవింద్ బుధవారం పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని మెనూ ప్రకారం అందించాలని సూచించారు. ఎంపీడీఓ సురేష్, ఎంపీఓ కలీల్ హైమద్, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ హారిక, కార్యదర్శి సంగీత, ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.

పిచ్చి మొక్కల తొలగింపు



ధర్మాయిపేట మలుపువద్ద పిచ్చి మొక్కలను తొలగింపజేస్తున్న ఎస్సై

కడెం: మండలంలోని ధర్మాయిపేట వద్ద ఉన్న రెండు మూల మలుపుల వద్ద ప్రమాదకరంగా ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను కడెం ఎస్సై కృష్ణసాగర్ రెడ్డి బుధవారం బ్లేడు ట్రాక్టర్‌తో తొలగించారు. ఈ మలుపుల వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎస్సై చొరవ తీసుకుని పిచ్చిమొక్కలను తొలగింపజేయడంతో సమస్య తీరింది.

గల్ఫ్‌లో మల్లాపూర్ వాసి మృతి



ఆకుల గణేష్

లక్ష్మణచాంద, న్యూస్‌టుడే: ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లిన యువకుడు పని చేస్తున్న ప్రదేశంలో గుండెపోటుతో మృతి చెందారు. గ్రామస్థులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మణచాంద మండలం మల్లాపూర్ వాసి ఆకుల గణేష్(31) నాలుగేళ్ల క్రితం దుబాయ్ వెళ్లారు. అక్కడ వాహన చోదకునిగా పనిచేస్తున్నారు. రెండు రోజుల క్రితం వాహనంలోనే గుండెపోటు రావటంతో అక్కడికక్కడే మరణించారు. అక్కడి పోలీసులు దుబాయ్‌లో ఉంటున్న తెలుగు వారికి సమాచారం చేరవేశారు. గణేష్ చరవాణిలోని కాల్‌డేటా ఆధారంగా మిత్రులకు సమాచారం అందించారు. అక్కడున్న తెలుగువారు బుధవారం గ్రామస్థులకు, కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేశారు. గణేష్ మృతి వార్త తెలుసుకుని కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతదేహం త్వరగా వచ్చేలా చూడాలని కుటుంబ సభ్యులు కోరారు. మృతుడు గణేష్‌కు భార్య, కుమారుడు ఉన్నారు.

వివాహిత ఆత్మహత్య

నిర్మల్: జిల్లా కేంద్రంలోని గాజుల్‌పేట్‌కు చెందిన ఉజ్మా బేగం (31) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోధన్‌కు చెందిన ఉజ్మా బేగం వివాహం నిర్మల్ పట్టణం గాజుల్‌పేట్‌కు చెందిన రహీంపాషాతో 2008లో జరిగింది. ఈయన ఆర్టీసీలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఉజ్మాబేగం మానసిక పరిస్థితి సరిగా లేకపోవడంతో ఆసుపత్రుల్లో వైద్యం చేయించినా నయం కాలేదు. బుధవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నారు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఈమెకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతురాలి తల్లి రషీదా బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఉరి వేసుకుని యువకుడి బలవన్మరణం

నిర్మల్, న్యూస్‌టుడే: ఉరి వేసుకుని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కుభీరు మండలం రంగశివుని గ్రామానికి చెందిన హనుమంతు (23) కూలీ పనులు చేసుకుంటూ నిర్మల్‌లో జీవనం కొనసాగిస్తున్నారు. తండ్రి సాయన్న స్థానిక గాయత్రి టౌన్‌షిప్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నారు. తండ్రి వద్దే ఉంటున్న హనుమంతు ప్రతి రోజూ కూలీ పనులకు వెళ్లి వస్తుండే వారు. రోజులాగే కూలీ పనులకు వెళ్లిన హనుమంతు మంగళవారం రాత్రి తండ్రి వద్దకు రాలేదు. అదే కాలనీలో ఓ చెట్టుకు ఉరి వేసుకున్నారు. బుధవారం ఉదయం గమనించిన కాలనీ వాసులు తండ్రికి, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉందని పేర్కొన్నారు.

నేర వార్తలు

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి దుర్మరణం

భైంసా గ్రామీణం, న్యూస్‌టుడే: భైంసా-బాసర మార్గంలో బుధవారం సాయంత్రం చోటు చేసుకున్న వేర్వేరు రహదారి ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. కుటుంబీకులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కుభీరు మండలం బాకోట్ వాసి నామత్‌కర్ సాయినాథ్(36) ద్విచక్ర వాహనంపై భైంసా మండలం వాలేగాంలోని బంధువుల వద్దకు వెళ్లి, తిరుగు ప్రయాణమయ్యారు. దేగాం వంతెన వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లి పోయింది. దీంతో సాయినాథ్ అక్కడికక్కడే మృతి చెందారు.

☛ అదే మార్గంలో ముథోల్ మండలం సరస్వతినగర్‌కు చెందిన వాగ్మారే మురళీధర్(37) ద్విచక్ర వాహనంపై భైంసా నుంచి ఇంటికి వెళుతుండగా రైస్ మిల్లు సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలపాలైన మురళీధర్ అక్కడికక్కడే మృతి చెందారు.



అభిరాజ్

ఇచ్చోడ: నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం బిలోలికి చెందిన అభిరాజ్(19) తన మిత్రుడితో కలిసి ద్విచక్రవాహనంపై ఉట్నూరు వెళ్లి తిరుగు ప్రయాణమయ్యాడు. ఇచ్చోడ సమీపంలోని జాతీయ రహదారిపై వెనుక నుంచి నీటి ట్యాంకర్‌ను ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. అభిరాజ్ తీవ్రంగా గాయపడటంతో రిమ్స్ ఆసుపత్రికి తీసుకెళ్లే క్రమంలో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు.

దేశీదారు పట్టివేత

ముథోల్(బాసర): బాసర మండలం బీద్రెల్లి సమీపంలో సరిహద్దు చెక్‌పోస్టు దగ్గర దేశీదారును ముథోల్ సీఐ మల్లేష్, బాసర ఎస్సై గణేశ్ పట్టుకున్నారు. బుధవారం సాయంత్రం మహారాష్ట్ర సరిహద్దులో వాహనాల తనిఖీ చేపట్టారు. మహారాష్ట్ర నుంచి భైంసాకు వస్తున్న ఆర్టీసీ బస్సు తనిఖీ చేయగా అందులో 16 లీటర్ల దేశీదారు పట్టుబడింది. ధర్మాబాద్ నుంచి కామారెడ్డి జిల్లా బిక్కునూర్‌కు దేశీదారును తరలిస్తున్న ప్రవీణ్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు.

సోయా బస్తాల అపహరణ

కుంటాల: మండలంలోని అందకూర్‌కు చెందిన రైతు కన్నం సత్యం సోయా బస్తాలు చోరీకి గురయ్యాయి. రహదారి పక్కనే పంట ఆరబెట్టిన చోట బుధవారం విక్రయ కేంద్రానికి తరలించేందుకు వీలుగా 33 సంచుల్లో సోయా నింపి ఉంచారు. మంగళవారం రాత్రి దొంగలు ఓ వాహనంలో 11 బస్తాలను అపహరించుకుపోయారు.

కారు ఢీకొని ఇద్దరికి గాయాలు

ముథోల్(బాసర): బాసర ఆర్జీయూకేటీ సమీపంలో భైంసా-బాసర రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రహదారి ప్రమాదంలో ఇద్దరికి గాయాలైనట్లు బాసర ఎస్సై గణేశ్ తెలిపారు. ద్విచక్రవాహనాన్ని వెనకాల నుంచి కారు ఢీకొట్టడంతో నిజామాబాద్ జిల్లా నవీపేట మండలం యంచ గ్రామానికి చెందిన విజయ్, లక్ష్మిలకు తీవ్రగాయాలయ్యాయని చెప్పారు.

దిలావర్‌పూర్: సిర్గాపూర్ బస్టాండ్ సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నిర్మల్‌కు చెందిన ఆటో చోదకుడు మన్సూర్‌కు గాయాలయ్యాయని ఎస్సై రాజేశ్వర్‌గౌడ్ తెలిపారు. ఆటోను వెనుక నుంచి వచ్చిన కారు ఢీ కొనడంతో ప్రమాదం జరిగింది.

భార్యపై భర్త కత్తితో దాడి



నిర్మల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నవనీత

నిర్మల్, న్యూస్‌టుడే: భార్యపై భర్త కత్తితో దాడి చేసిన ఘటన బుధవారం నిర్మల్‌లో చోటుచేసుకుంది. పట్టణ ఎస్సై సందీప్ తెలిపిన వివరాల ప్రకారం. . స్థానిక చింతకుంటవాడలో నవనీత-గోవింద్ దంపతులు ఆర్నెళ్లుగా నివాసం ఉంటున్నారు. భార్య నవనీత బస్టాండ్ ప్రాంతంలోని ఓ డయోగ్నొస్టిక్ సెంటర్‌లో పనిచేస్తున్నారు. భర్త గోవింద్ కూలీ పనులు చేస్తూ మద్యానికి బానిసగా మారడంతో నిత్యం ఇంట్లో భార్యాభర్తల మధ్య గొడవలు జరిగేవి. ఈ క్రమంలో మంగళవారం రాత్రి ఇద్దరి మధ్య గొడవ జరగడంతో భార్య ఇంటి నుంచి వెళ్లిపోయారు. బుధవారం యథావిధిగా తాను పనిచేస్తున్న డయోగ్నొస్టిక్ సెంటర్‌కు వెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న గోవింద్ అక్కడికి చేరుకుని భార్యతో వాగ్వాదం పెట్టుకున్నాడు. ఇద్దరి మధ్య మాటలు పెరగడంతో గోవింద్ తన వెంట తెచ్చుకున్న కత్తితో భార్య ఛాతి, వీపులో పొడిచాడు. తీవ్ర రక్తస్రావమైన నవనీతను స్థానికులు ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

భైంసా మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా ఆనంద్‌రావు పటేల్

భైంసా, న్యూస్‌టుడే: భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని బుధవారం ప్రకటించారు. ఛైర్మన్‌గా మాంజ్రి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సింధే ఆనంద్‌రావుపటేల్, వైస్ ఛైర్మన్‌గా భైంసాకు చెందిన ఎండీ ఫారుఖ్ అహ్మద్ నియమితులయ్యారు. డైరెక్టర్లుగా డి.రామేశ్వర్, నడిమిశెట్టి భూమన్న, షేక్ మౌలామియా, తోట రాము, రాథోడ్ రామనాథ్, జాదవ్ సురేఖ, గడ్‌పాలే దేవిదాస్, సట్ల కిష్టన్న, మాధవరావు, అల్లాపూర్ సుధాకర్‌రావు, కుంటొల్ల విఠల్, కదం దత్తారాంలను నియమించారు.

ఏబీవీపీ నిర్మల్ నగర నూతన కమిటీ ఎన్నిక

నిర్మల్, న్యూస్‌టుడే: ఏబీవీపీ నిర్మల్ నగర నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. విభాగ్ సంఘటన కార్యదర్శి రాజుసాగర్, జాతీయ కార్యవర్గ సభ్యుడు శివ, ఇందూర్ విభాగ్ కన్వీనర్ కైరి శశిందర్ ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు జరిగాయి. నిర్మల్ నగర కార్యదర్శిగా సాయికుమార్, ఉపాధ్యక్షులుగా విలాస్ నితిన్, నిమ్మల సాయి, విష్ణుచరణ్, సంయుక్త కార్యదర్శులుగా మున్నా, జీవన్, చరణ్, అంబాదాస్ ఎన్నికయ్యారు. వివిధ విభాగలకు బాధ్యులను నియమించారు. సంఘ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దినేశ్, జిల్లా ప్రముఖ్ ఈశ్వర్, పూర్వ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సూర్యకుమార్, రాష్ట్ర వనవాసీ ప్రముఖ్ లక్ష్మణ్ చౌహాన్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీయూకేటీలో జాతీయ సదస్సు

ముథోల్(బాసర), న్యూస్‌టుడే: ప్రపంచీకరణ ప్రభావం గణిత సవాళ్లు అనే అంశంపై ఆర్జీయూకేటీ, తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సహకారంతో మ్యాథమెటిక్స్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం ఒక రోజు జాతీయ సదస్సు నిర్వహించారు. గణితశాస్త్ర నిపుణులు, ఆచార్యులతో కలిసి పరిపాలన విభాగం అధికారి రణధీర్ సదస్సు ప్రారంభించారు. సమన్వయకర్త తిరుపతి, అసోసియేట్ డీన్స్ పావని, చంద్రశేఖర్, మ్యాథమెటిక్స్ విభాగం అధ్యాపకులు సునిల్‌కుమార్, రాగుల బాలరాజు, సత్తన్న, సాయన్న, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

దాడిని ఖండిస్తూ నిరసన

నిర్మల్: హైదరాబాద్‌లో ముత్యాలమ్మ విగ్రహంపై జరిగిన దాడిని ఖండిస్తూ సనాతన ధర్మపరిరక్షణ సమితి ఆధ్వర్యంలో బుధవారం స్థానిక గాంధీచౌక్‌లో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసెమ్మె రాజు మాట్లాడుతూ ఈ దాడులు హిందూ మనోభావాలు దెబ్బతీసేలా ఉన్నాయన్నారు. కౌన్సిలర్లు ఎడపెల్లి నరేందర్, బిట్లింగు నవీన్, ఆదుముల్ల పద్మాకర్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు వొడిసెల అర్జున్, తదితరులు పాల్గొన్నారు.

కుమురం సూరు వర్ధంతి



కుమురం సూరు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తహసీల్దార్ లక్ష్మణ్

పెంబి: నిజాం నిరంకుశ పాలనపై తిరుగుబాటు చేసి కుమురం భీంకు అండగా ఉద్యమాలు చేస్తు ఆదివాసీల్లో స్వాతంత్ర్య కాంక్షను రగిలించిన వ్యక్తి కుమురం సూరు అని ఆదివాసీ సంఘం జిల్లా అధ్యక్షుడు టేకం భీంరావు అన్నారు. బుధవారం మండలంలోని వేణునగర్‌లో ఆయన వర్ధంతి సభ నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తహసీల్దార్ లక్ష్మణ్, ఎంపీడీఓ రమాకాంత్, ఆదివాసీ నాయకులు రమేష్, లక్ష్మణ్, రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి

భైంసా గ్రామీణం: అర్హులు ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకుని లబ్ధిపొందాలని డీఆర్డీఓ విజయలక్ష్మి అన్నారు. మండలంలోని దేగాంలో బుధవారం ఈజీఎస్ గ్రామసభ నిర్వహించారు. రైతులకు ఉపయోగపడే ప్రాధాన్య పనులను గుర్తించి ఆమోదించాలన్నారు. ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి, ఈసీ రాజ్‌కుమార్ కార్యదర్శి భోజన్న, టీఏ శ్రీధర్, ఎఫ్ఏ దత్తు, తదితరులు పాల్గొన్నారు.

భాజపా సభ్యత్వ నమోదు పరిశీలన

కుభీరు: భాజపా సభ్యత్వ నమోదు లక్ష్యాన్ని అధిగమించాలని పార్టీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కల్యాణ్‌నాయక్ పార్టీ శ్రేణులకు సూచించారు. బుధవారం కుభీరులో చేపడుతున్న సభ్యత్వ నమోదును ఆయన పరిశీలించారు. మొదటిసారి కుభీరుకు వచ్చిన ఆయన్ని పార్టీమండలశాఖ ఆధ్వర్యంలో సన్మానించారు. పార్టీ మండల అధ్యక్షుడు ఏశాల దత్తాత్రి, పండిత్ జాదవ్ పార్టీశ్రేణులు పాల్గొన్నారు.